31వ వసంతంలోకి
చురకలు
కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా
బుధవారం,అక్టోబర్ 28 , 2026 పేజీలు : 8

# పీఎం రహత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

## -ఎస్పీ అశోక్‌కుమార్



చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 27 : రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు సకాలంలో వైద్య చికిత్స అందించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం రహత్ పథకంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు.మంగళవారం ఆయన మాట్లాడుతూ జిల్లా పరిధిలో మొత్తం 30 ఆసుపత్రుల్లో ఈ పథకం కింద వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, అర్హత నిబంధనలకు అనుగుణంగా రూ.1.5 లక్షల వరకు గరిష్ఠంగా ఏడు రోజుల పాటు నగదు రహిత వైద్య చికిత్స పొందవచ్చని తెలిపారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే బాధితులకు వీలైనంత త్వరగా వైద్య సహాయం అందించడం కీలకమని, గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించి సహకరించాలని కోరారు. ప్రమాద బాధితులకు సహాయం చేయడానికి ప్రజలు ముందుకు రావాలని, అత్యవసర పరిస్థితుల్లో 112కు కాల్ చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో సీటు బెల్ట్ ధరించాలని, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని ఎస్పీ సూచించారు.

# ఎల్‌నినో పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలి

- సాగు, తాగునీటి సరఫరా పై ముందస్తు చర్యలు చేపట్టాలి
- గోదావరి పుష్కరాలు 2027 పనులు వెంటనే ప్రారంభించి గడువులోగా పూర్తి చేయాలి
- జగిత్యాల కలెక్టర్ బి. సత్య ప్రసాద్

చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 27: ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని యాసంగి సాగు, తాగునీటి సరఫరా, భూగర్భ జలాల సంర క్షణపై అధికారులు ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం జగిత్యాల జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, అదనపు కలెక్టర్‌తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం, ఖరీఫ్ పంటల పరిస్థితి, యాసంగి సాగు ప్రణాళిక, ఉద్యాన పంటలు, తాగునీటి సరఫరా, పశుగ్రాసం, ప్రజారోగ్యం, గోదావరి పుష్కరాలు--2027 ఏర్పాట్లపై సమగ్రంగా సమీక్షించారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జూన్ 1 నుంచి అక్టోబర్ 26 వరకు జిల్లాలో సాధారణ వర్షపాతం 3,794.8 మి.మీ. కాగా, వాస్తవంగా 2,982.1 మి.మీ. వర్షపాతం నమోదైందని అధికారులు వివరించారు. సాధారణ వర్షపాతంతో పోలిస్తే 21 శాతం లోటు నమోదైందని, గత ఏడాదితో పోలిస్తే వర్షపాతం 30 శాతం తక్కువగా ఉందని తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలంలో 27 శాతం, కోరుట్లలో 22 శాతం, మేడిపల్లిలో 22 శాతం, మల్లాపూర్‌లో 15 శాతం వర్షపాతం లోటు




నమోదైనట్లు వివరించారు. కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 1,03,845 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయగా, అందులో 72,210 ఎకరాల్లో వరి సాగు చేసినట్లు అధికారులు తెలిపారు. వరి పంటలో 455 ఎకరాల్లో నీటి ఒత్తిడి ఏర్పడగా, 101 ఎకరాల్లో పంట ఎండిపోయిందని, అందులో కోరుట్ల మండలంలోనే 80 ఎకరాలు ఉన్నాయని వివరించారు. ఎల్‌నినో పరిస్థితుల కారణంగా యాసంగిలో వరి సాగును గణనీయంగా తగ్గించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గత యాసంగిలో సుమారు 70,229 ఎకరాల్లో వరి సాగు చేయగా, ఈసారి 29,918 ఎకరాలకు తగ్గించాలని వ్యవసాయ శాఖ అంచనా వేసిందని తెలిపారు. ఈ లక్ష్యాన్ని సాధించేలా క్షేత్రస్థాయి వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. గత యాసంగిలో 21,693 ఎకరాల్లో సాగైన మొక్కజొన్నను ఈసారి 29,276 ఎకరాలకు పెంచాలని అంచనా వేసినట్లు తెలిపారు. గత ఏడాది మొత్తం యాసంగి సాగు విస్తీర్ణం 93,218 ఎకరాలు కాగా, ఈసారి 62,904 ఎకరాలకు తగ్గే అవకాశం ఉందని వివరించారు. నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకొని పంటల ప్రణాళిక రూపొందించాలని, నీటి అవసరం తక్కువగా ఉండే పంటల సాగును ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. పంటల వైవిధ్యీకరణకు ఇదే సరైన సమయమని, రైతులు వరి సాగుపై ఆధారపడకుండా ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్, ఇతర తక్కువ నీటితో సాగు చేయగల పంటల వైపు మళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉండేలా చూడాలని, వ్యవసాయ బోర్ల పరిస్థితిని పర్యవేక్షించాలని సూచించారు. యాసంగిలో రెండో పంటగా వరి సాగు చేయవద్దనే విషయాన్ని రైతులకు స్పష్టంగా తెలియజేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ సూచించారు. ఎల్‌నినో ప్రభావం, నీటి వనరుల పరిస్థితి, భవిష్యత్తులో ఎదురయ్యే నీటి కొరతను రైతులకు వివరించి, తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. యాసంగిలో జిల్లాలో సుమారు 377 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు చేపట్టే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. జిల్లాలో 495 మంది రైతులు మొత్తం 1,253 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారని, 783.8 ఎకరాల్లో సూక్ష్మ సేద్య పరికరాల ఏర్పాటు పూర్తయినట్లు వివరించారు.ఎల్‌నినో పరిస్థితుల్లో నీటిని సమర్థవంతంగా వినియోగించుకునే పద్ధతులకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సేద్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించి, అర్హులైన రైతులకు అందుబాటులో ఉన్న పథకాల ప్రయోజనాలు అందేలా చూడాలని ఆదేశించారు. తక్కువ నీటితో పండే ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంచేందుకు-మిగతా 2లో

### ప్రభుత్వం విద్య, వైద్యానికి

# అధిక ప్రాధాన్యత



## -ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్

చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 27: తెలంగాణ రాష్ట్రంలో విద్య, వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణంలోని పొన్నాల గార్డెన్స్ లో జగిత్యాల అర్బన్, రూరల్ మండలాలకు చెందిన 88 మందికి సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.29 లక్షల విలువగల చెక్కులను, 93 మంది ఆడబిడ్డలకు కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకంలో భాగంగా మంజూరైన రూ.93 లక్షల 5 వేల విలువగల చెక్కులను మంగళవారం లబ్ధిదా రులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ అత్యధిక పల్లె దవాఖానలు జగిత్యాలకు మంజూరయ్యాయని, హెల్మెట్ వాడ కంతో ప్రాణాపాయం తప్పుతుందని అన్నారు. అధికారులు ప్లాస్టిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని, ప్రజల భాగస్వామ్యం కూడా-మిగతా 2లో

# చామనపల్లి గ్రామం మొత్తానికి భూసేకరణ, పునరావాసం కల్పిస్తాం

## రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

చురకలు, విలేఖరి, వెల్గటూర్, అక్టోబర్ 27 : పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం చామనపల్లి గ్రామానికి మేడారం రిజర్వాయర్ ముంపు ప్రమాదం దృష్టిలో పెట్టుకొని ప్రజలకు ఇచ్చిన హామీమేరకు గ్రామం మొత్తానికి భూసేకరణ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు 7 రోజుల్లో 8 ప్రత్యేక బృందాల ఏర్పాటుతో ప్రతిఇంటి నిర్మాణం, చెట్లు, బావులు, ఇతర ఆస్తుల వివరాలతో అంచనాలు 3 నుంచి 4 నెలల్లో భూసేకరణ, పరిహారం, పునరావాస ప్రక్రియ పూర్తి చేసేలా



చర్యలు చేపడుతు న్నట్లు రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. ప్రజలకు నిబంధనల పై అవగాహన కల్పించి, మానవతా దృక్పథంతో ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గత ప్రభుత్వ పాలకుల మాదిరి ఏదో గాలి మాటలు చెప్పి వెళ్ళిపోయే రకం కాదని,ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చ స్తామని తెలిపారు. చామనపల్లి గ్రామ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొం టున్న ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా గ్రామం మొత్తాని కి భూసేకరణ చేపట్టి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం, పునరా వాసం, పునరుద్ధరణ (ఆర్‌అండ్‌ఆర్) ప్యాకేజీ అమలు చేస్తామని మంత్రి అడ్లూరి తెలిపారు. మంగళవారం ధర్మారం మండలం చామనపల్లి గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి నిర్వహించిన గ్రామసభలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు.గత అనేక సంవత్సరాలుగా భారీ వర్షాలు కురిసినప్పుడు, -మిగతా 2లో

# ఉకోరుట్లలో అక్రమ నిర్మాణాల తొలగింపు

**-పోలీస్ స్టేషన్ ఎదురుగా దుకాణాల కూల్చివేత..**

**-అధికారులతో భవన యజమాని వాగ్వాదం**



**చురకలు ప్రతినిధి కోరుట్ల, అక్టోబర్ 27 :** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన భవనంలోని దుకాణాలను అధికారులు మంగళవారం తొలగించారు. నిబంధనల ప్రకారం అవసరమైన సెట్బ్యాక్ వదలకుండా నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తించడంతో ఈ చర్యలు చేపట్టినట్లు సమాచారం. గతంలోనే సంబంధిత భవన యజమానికి అధికారులు నోటీసులు జారీ చేసినప్పటికీ వాటిని పట్టించు కోకుండా నిర్మాణ పనులు కొనసాగించడంతో తొలగింపు చర్యలకు ఉపక్రమించి నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో భవనంలోని దుకాణాలను తొలగిస్తుండగా యజమాని జాప లచ్చన్న మున్సిపల్ కమిషనర్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. పట్టణంలో అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన భవనాలపై అధికారులు చేపడుతున్న చర్యలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.

## ప్రభుత్వం విద్య, వైద్యానికి...

మొదటి పేజీ తరువాయి...తప్పనిసరని, రానున్న రోజుల్లో డంపింగ్ యార్డుల సమస్య తీవ్రం కానుందని తెలిపారు. తడి-పొడి చెత్తను వేరుగా ఇవ్వాలని, పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం చేకూరుతుందని, తరచూ బీపీ, షుగర్ పరీక్షలు చేయించడం ద్వారా మెదడు సంబంధిత వ్యాధులను త్వరితగతిన గుర్తించవచ్చని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనలో జగిత్యాలకు రూ.12 కోట్లకు పైగా సీఎం సహాయ నిధి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు దామోదర్ రావు, సందీప్ రావు, మాజీ జడ్పీటీసీలు ముస్కు ఎల్లారెడ్డి, పెండెం రాములు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాల ముకుందం, మాజీ ఏఎంసీ చైర్మన్ నక్కల రవీందర్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ అబ్బారి మల్లేశం గౌడ్, జిల్లా మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బొలిశెట్టి గంగారెడ్డి, కట్ల రాజేందర్, తహసీల్దార్లు హకీమ్, రామ్మోహన్, ఆర్ఐలు భూమయ్య, నరేందర్, సర్పంచులు, ఉప సర్పంచులు, పట్టణ, మండల నాయకులు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చామనపల్లి గ్రామం మొత్తానికి...

నీటిని ఎత్తిపోసే సమయంలో చామనపల్లి గ్రామ ప్రజలు ముంపు సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొన్నారని మంత్రి తెలిపారు. 2006లో ధర్మారం మండలం నుంచి జడ్పీటీసీగా తన రాజకీయ ప్రస్థానం ప్రారంభమైందని, ఈ ప్రాంతంలోని గ్రామాలతో తనకు సుమారు 25 సంవత్సరాల అనుబంధం ఉందని పేర్కొన్నారు. సాధారణంగా నిబంధనల ప్రకారం పూర్తి స్థాయి నీటి మట్టం(ఎఫ్టీఎల్) నుంచి 100 మీటర్ల పరిధిలో భూసేకరణ చేపట్టే అవకాశం ఉన్నప్పటికీ, చామనపల్లి గ్రామ ప్రజల సమస్యను దృష్టిలో ఉంచుకొని తొలిసారిగా ఆ పరిమితికి మించి గ్రామం మొత్తానికి భూసేకరణ చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు.

**ముఖ్యమంత్రి హామీ మేరకు భూసేకరణ**

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టంగా సూచించారని మంత్రి తెలిపారు. చామనపల్లి గ్రామం మొత్తానికి భూసేకరణ చేపట్టాలనే నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు.గత 10 సంవత్సరాలు గా ఎదురుచూస్తున్న ఈ కార్యక్రమం ఇప్పుడు కార్యరూపందాల్చుతోందని దీనిని విజయవంతంగా పూర్తి చేసేందుకు గ్రామ ప్రజలు అధికారులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. భూసేకరణ, ఆర్అండ్ఆర్ ప్రక్రియకు సంబంధించి నిబంధనలు, పరిహారం, పునరావా సానికి సంబంధించిన అంశాలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.భూసేకరణ ప్రక్రియలో చిన్న చిన్న సమస్యలు ఎదురైతే వాటిని నిబంధనల ప్రకారం పరిష్కరించాలని మంత్రి తెలిపారు. ఈ అంశంలో రాజకీయాలకు తావు లేకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. గ్రామ ప్రజలతో తనకు దీర్ఘకాల అనుబంధం ఉందని, ప్రజల సమస్యలను అర్థం చేసుకొని అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. గ్రామంలోని ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని, భూసేకరణ, పరిహారం, పునరావాసం విషయంలో ప్రజలకు ఎలాంటి సందేహాలు ఉన్నా వాటిని నివృత్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. ఈ ప్రక్రియను అందరూ కలిసి సమన్వయంతో పూర్తి చేయాలని కోరారు.

# ఎల్‌నినో పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలి

**మొదటి పేజీ తరువాయి....** వ్యవసాయ, ఉద్యాన శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. జిల్లాలో 246 చిన్న నీటి వనరుల మొత్తం సామర్థ్యం 2,412 ఎంసీఎఫ్టీ కాగా, ప్రస్తుతం 1,116 ఎంసీఎఫ్టీ నీరు అందుబాటులో ఉందని అధికారులు వివరించారు. ఇది మొత్తం సామర్థ్యంలో 46 శాతమని తెలిపారు. కోరుట్ల ప్రాంతంలో భూగర్భ జలమట్టం గత 11 సంవత్సరాల్లో ఎన్నడూ లేనంత దిగువకు చేరిందని పేర్కొన్నారు. ఎల్నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రానున్న 6 నెలల పాటు కొత్త బోర్లు వేయకుండా కఠినంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. భూగర్భ జలాలను సంరక్షించేందుకు ప్రజలు, రైతులకు అవగాహన కల్పించాలని, అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వీబీ-జీ రామ్ జీ పథకం కింద చేపట్టిన ఇంకుడు గుంతలు, ఫామ్ పాండ్స్, ఇతర నీటి సంరక్షణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నీటి నిల్వలు పెంచే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని, చేపట్టిన పనుల పురోగతిని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. జిల్లాలో 180 రోజుల అవసరాలకు 0.491 లక్షల మెట్రిక్ టన్నుల పశుగ్రాసం అవసరం కాగా, ప్రస్తుతం 1.158 లక్షల మెట్రిక్ టన్నుల పశుగ్రాసం అందుబాటులో ఉందని అధికారులు వివరించారు. పశువులకు మేత, తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పనిచేయని పశువుల నీటి తొట్టెలను గుర్తించి మరమ్మతులు చేపట్టి తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. అందుబాటులో ఉన్న పశుగ్రాసాన్ని సక్రమంగా వినియోగించుకునేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలో గ్రామీణ ప్రాంతాలకు రోజుకు 20,260 కిలోలీటర్ల తాగునీరు అవసరం కాగా, ప్రస్తుతం 12,900 కిలోలీటర్లు మాత్రమే సరఫరా అవుతోందని అధికారులు వివరించారు. రోజుకు 7,360 కిలోలీటర్ల తాగునీటి కొరత ఉన్నట్లు తెలిపారు. ముఖ్యంగా మేడిపల్లి, మల్లాపూర్ మండలాల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేసి విడుదల చేసినందున, రానున్న 45 రోజుల్లోగా పరిస్థితి మెరుగుపడేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పైప్‌లైన్ లీకేజీలను గుర్తించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని, నీటి సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలని సూచించారు. కోరుట్ల, మేడిపల్లి మున్సిపాలిటీల పరిధిలో తాగునీటి సరఫరాకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రత్యామ్నాయ బోర్లు, చేతిపంపులు, ట్యాంకర్ల ద్వారా అవసరమైన ప్రాంతాలకు నీరు అందించే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నీటి సరఫరాకు సంబంధించి స్పష్టమైన ప్రామాణిక కార్యాచరణ విధానాన్ని రూపొందించి, దాని ప్రకారం సరఫరా జరిగేలా చూడాలని తెలిపారు. స్థానిక నీటి వనరులు కూడా క్రమంగా తగ్గిపోతున్నాయని, భవిష్యత్తులో మిషన్ భగీరథ నీటిపై మరింత ఆధారపడాల్సిన పరిస్థితి రావచ్చని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పేర్కొన్నారు. ప్రజలకు సరిపడా తాగునీరు అందేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని, పైప్‌లైన్ లీకేజీలు అరికట్టాలని, మున్సిపాలిటీల్లో పెండింగ్ తాగునీటి పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. తాగునీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. జిల్లాలో 4 డెంగ్యూ, 1 మలేరియా కేసు నమోదైనట్లు అధికారులు వివరించారు. కోరుట్ల ఏరియా ఆసుపత్రి, మేడిపల్లి సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో జ్వరాలు, వడదెబ్బ బాధితులకు అవసరమైన వైద్య సదుపాయాలు సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ సూచించారు. వైద్య కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు అందుబాటులో ఉంచాలని, జ్వరాలపై పర్యవేక్షణ పెంచాలని, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రజలకు తాగునీటి పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించాలని సూచించారు. గోదావరి పుష్కరాలు-- 2027కు కోరుట్ల నియోజకవర్గ పరిధిలో సుమారు 38 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. 2015 పుష్కరాల సమయంలో ఈ ప్రాంతానికి 9.45 లక్షల మంది భక్తులు రాగా, 2027లో భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ సూచించారు. మల్లాపూర్ మండలానికి 2015లో 1.25 లక్షల మంది భక్తులు రాగా, 2027లో 15 లక్షల మంది వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. ఇబ్రహీంపట్నం మండలానికి 2015లో 8.20 లక్షల మంది భక్తులు రాగా, 2027లో 23 లక్షల మంది వచ్చే అవకాశం ఉందని అధికారులు వివరించారు. మల్లాపూర్ మండలంలో వి.వి. రావుపేట, వల్గొండ, మొగిలిపేట, ఓబులాపూర్, కొత్త ధర్మారంపల్లి, పాత ధర్మారంపల్లి గ్రామాల్లో పుష్కర ఘాట్ల ఏర్పాట్లను ప్రతిపాదించారు. ఇబ్రహీంపట్నం మండలంలో కోమటికొండాపూర్, ఎర్రదండి, ములరాంపూర్, బర్దీపూర్, వేములకుర్తి, రత్నాలమడుగు (వేములకుర్తి), ఫకీర్ కొండాపూర్, యమాపూర్ (బొక్కల మడుగు) గ్రామాల్లో పుష్కర ఘాట్లకు సంబంధించిన ఏర్పాట్లు చేపట్టాలని ప్రణాళిక రూపొందించారు. గోదావరి పుష్కరాల కోసం మొత్తం రూ.226.41 కోట్ల అంచనా వ్యయంతో వివిధ పనులను ప్రతిపాదించినట్లు అధికారులు వివరించారు. ఇందులో మొదటి ప్రాధాన్యత పనులకు రూ.206.42 కోట్లు, రెండో, మూడో ప్రాధాన్యత పనులకు రూ.19.99 కోట్లు ప్రతిపాదించారు. మొదటి ప్రాధాన్యత పనుల్లో దేవాదాయ శాఖకు రూ.20 కోట్లు, నీటిపారుదల శాఖకు రూ.38.39 కోట్లు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగానికి రూ.43.55 కోట్లు, ప్రజారోగ్య శాఖకు రూ.15 కోట్లు, ధర్మపురి మున్సిపాలిటీ తాగునీరు, పారిశుధ్య పనులకు రూ.2 కోట్లు, పర్యాటక శాఖకు రూ.1 కోటి, రోడ్లు--భవనాల శాఖ రహదారుల పనులకు రూ.80 కోట్లు, విద్యుత్ శాఖకు రూ.6 కోట్లు ప్రతిపాదించినట్లు తెలిపారు. టైర్ 2, 3 ప్రాధాన్యత పనుల్లో నీటిపారుదల శాఖకు రూ.11.99 కోట్లు, పంచాయతీరాజ్ రహదారులకు రూ.5 కోట్లు, రోడ్లు--భవనాల శాఖ రహదారులకు రూ.3 కోట్లు ప్రతిపాదించినట్లు వివరించారు. విద్యుత్ శాఖకు సంబంధించి 32 పనులకు రూ.7.67 కోట్ల అంచనా వ్యయం ఉండగా, రెండో ప్రాధాన్యతలో రూ.2.09 కోట్ల పనులకు మాత్రమే అనుమతులు వచ్చాయని, మిగిలిన రూ.5.58 కోట్ల పనులకు అనుమతులు రావాల్సి ఉందని అధికారులు తెలిపారు. పుష్కరాల కోసం మల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 1,051 మంది, ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో 1,440 మంది చొప్పున మొత్తం 2,491 మంది పోలీసు సిబ్బంది అవసరమని ప్రతిపాదించినట్లు వివరించారు. గోదావరి పుష్కరాల కోసం మంజూరైన పనుల్లో కాంట్రాక్టర్ల ఎంపిక, టెండర్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే సంబంధిత అధికారులు, ఇంజినీర్లు క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మండల స్థాయిలో రోడ్లు, వంతెనలకు సంబంధించిన పనుల వివరాలను ఖరారు చేసిన వెంటనే పనులు ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, మంజూరైన పనులను ఆలస్యం చేయకుండా ప్రారంభించాలని, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పుష్కరాలకు వచ్చే భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని రహదారులు, వంతెనలు, ఘాట్లు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, భద్రత వంటి అంశాలకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. అన్ని పనులను నిర్ణీత గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్‌లో పంటలకు మంచి ధరలు లభిస్తున్నప్పటికీ, రానున్న కొన్ని వారాల్లో పంట దిగుబడులు మార్కెట్‌కు ఎక్కువగా వచ్చినప్పుడు ధరలు తగ్గే అవకాశం ఉందని ఎమ్మెల్యే డాక్టర్ కే.సంజయ్ తెలిపారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాల్సిన అవసరం లేకపోయినా, పంటలు మార్కెట్‌కు ఎక్కువగా వచ్చే సమయానికి ప్రభుత్వ కొనుగోళ్లు చేపట్టేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. రైతులకు కనీస మద్దతు ధర లభించేలా అవసరమైన సమయంలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, ప్రతి కొనుగోలు కేంద్రంలో అవసరమైన మౌలిక సదుపాయాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలని అన్నారు. పంటలు అధికంగా మార్కెట్‌కు వచ్చినప్పుడు కొనుగోళ్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు అందుబాటులో లేకపోతే వ్యాపారులు ధరల విషయంలో రైతులను ప్రభావితం చేసే అవకాశం ఉందని, అలాంటి పరిస్థితులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే తెలిపారు. మార్కెట్ పరిస్థితులను నిరంతరం పరిశీలిస్తూ, రైతుల ప్రయోజనాలను కాపాడేలా కనీస మద్దతు ధరకు కొనుగోళ్లు చేపట్టేందుకు ముందస్తు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఎల్నినో పరిస్థితులు, నీటి లభ్యత, యాసంగి పంటల సాగుపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే డాక్టర్ కే.సంజయ్ అన్నారు. రెండో పంటగా వరి సాగు చేయకూడదనే విషయాన్ని రైతులకు స్పష్టంగా తెలియజేయాలని, తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకునేలా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, రైతులకు అవసరమైన సూచనలు అందించడంతో పాటు తాగునీటి సరఫరా, నీటి సంరక్షణ, పుష్కరాల పనులు, ప్రభుత్వ కొనుగోళ్లకు సంబంధించిన ఏర్పాట్లను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్. ప్రసునాంబ, ఆర్.డి.ఓ. జీవాకర్ రెడ్డి , సంబంధిత అగ్రికల్చరల్ , హార్టికల్చర్, విద్యుత్, ఇరిగేషన్, వెటర్నరీ, మిషన్ భగీరథ, గ్రౌండ్ వాటర్, డీఆర్డీఏ, మున్సిపల్, పీఆర్, ఆర్అండ్బి శాఖల జిల్లా , డివిజనల్, మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్లు, ఉపకార వేతనాలు అందించాలి

**-ముస్లిం కమిటీ అధ్యక్షులు బారీకి యువకుల వినతి**



**చురకలు విలేకరి, జగిత్యాల, అక్టోబర్ 27 :** జగిత్యాల ముస్లిం సెంట్రల్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన వితంతువులు, పేద విద్యార్థులకు అందిస్తున్న పెన్షన్లు, ఉపకార వేతనాలు అందించాలని కోరుతూ జగిత్యాల పట్టణానికి చెందిన పలువురు యువకులు జగిత్యాల ముస్లిం కమిటీ అధ్యక్షులు ఎం.ఎ.బారీకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎం.ఎ.బారీ మాట్లాడుతూ జగిత్యాల ముస్లిం సెంట్రల్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన వితంతువులు, పేద విద్యార్థులకు అందిస్తున్న పెన్షన్లు, ఉపకార వేతనాలను త్వరగా అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు యూసుఫ్ ఆజాద్, యువకులు మీర్ యాసిన్ అలీ, ఇర్ఫాన్ ఖాన్, నాజీమ్, ఆసిమ్ సవాన్, ఇర్షాద్ తదితరులు పాల్గొన్నారు.

## పీసీసీ అధ్యక్షుడు,మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన జువ్వాడి కృష్ణారావు



**చురకలు ప్రతినిధి కోరుట్ల,అక్టోబర్ 27 :** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు మంగళవారం హైదరాబాద్‌లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా జరిగిన భేటీ వివరాలను జువ్వాడి కృష్ణారావు విలేకరులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో జువ్వాడి కృష్ణారావుతో పాటు కోరుట్ల నియోజకవర్గం, మల్లాపూర్ మండలానికి చెందిన సర్పంచులు, మండల సర్పంచుల ఫోరం కన్వీనర్ రొండ్ల రాజేశ్వరి, రాజారెడ్డి, వెంకటరెడ్డి, పద్మ, నరసయ్య, కిరణ్, మాజీ ఎంపీపీ నల్ల రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు

**-రాయికల్ మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్**



**చురకలు విలేకరి, రాయికల్, అక్టోబర్ 27 :** అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేపడుతుందని రాయికల్ మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్ అన్నారు. సోమవారం రాయికల్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం లో స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంప్రదాయ రేషన్ కార్డుల స్థానంలో క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ కార్డులను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. వీటి ద్వారా రేషన్ లబ్ధిదారుల వివరాలను సులభంగా గుర్తించడంతో పాటు ప్రజాపంపిణీ వ్యవస్థలో పారదర్శకత పెంపొందించేందుకు అవకాశం ఉందన్నారు.అర్హులైన ప్రతి కుటుంబం ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మనోహర్, తహసీల్దార్ నాగార్జున,వైస్ చైర్ పర్సన్ తురగ సౌజన్య, కౌన్సిలర్లు పల్లికొండ గంగాధర్,పుర్రె శ్రీధర్, కోఆప్షన్ సభ్యులు ఇర్ఫాన్,ఇంతియాజ్ పర్వీన్,నాయకులు తురగ శ్రీధర్,మచ్చ శేఖర్, మురళి, ఆర్ ఐ పద్మయ్య,జిపిఓలు దాస్ కుమార్, రాజేందర్, రేషన్ షాప్ డీలర్లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ధర్మారం 11వ వార్డు సభ్యుడు నూనె సాయి గణేష్ సస్పెన్షన్

**-జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, అక్టోబర్ 27 :** పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం ధర్మారం గ్రామ పంచాయతీ 11వ వార్డు సభ్యుడు నూనె సాయి గణేష్‌ను గ్రామ పంచాయతీ ఇంటి నంబర్లు, అసెస్మెంట్ నంబర్ల నమోదు ప్రక్రియలో అక్రమాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైన అంశాల ఆధారంగా సస్పెండ్ చేసినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. ధర్మారం గ్రామ పంచాయతీకి సంబంధించి 2026-2027 సంవత్సరపు డిమాండ్ రిజిస్టర్‌లో ఇంటి నంబర్లు, అసెస్మెంట్ నంబర్ల కేటాయింపులో అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఈ వ్యవహారంపై పెద్దపల్లి డివిజనల్ పంచాయతీ అధికారి విచారణ నిర్వహించి నివేదిక సమర్పించినట్లు పేర్కొన్నారు.విచారణలో భాగంగా అసెస్మెంట్ నంబర్లు 153, 154, 173, 186లకు సంబంధించిన వివరాలు పరిశీలించగా,వాటిని వరుసగా నూనె మంజుల,సమాల అనిల్,గుర్రాల స్వరూప,నూనె శ్రీనివాస్ పేర్లపై నమోదు చేసినట్లు గుర్తించారని తెలిపారు. ఈ అసెస్మెంట్ నంబర్ల నమోదులో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు విచారణ నివేదికలో పేర్కొన్నారని వెల్లడించారు.ఈ వ్యవహారంలో అప్పటి పంచాయతీ కార్యదర్శి,ప్రస్తుత పంచాయతీ కార్యదర్శి,ఈ-పంచాయతీ ఆపరేటర్, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరుల వాంగ్మూలాలను విచారణలో పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిపారు. అప్పటి పంచాయతీ కార్యదర్శి ఈ అంశంపై ధర్మారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధిగా బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన వార్డు సభ్యుడు తన అధికార స్థానాన్ని దుర్వినియోగం చేసి, ఇతరులతో కలిసి నిబంధనల కు విరుద్ధంగా అసెస్మెంట్ నంబర్ల నమోదు ప్రక్రియలో జోక్యం చేసుకున్నట్లు విచారణ నివేదికలో వెల్లడైన అంశాలను పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిపారు.ఈ నేపథ్యంలో తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం, 2018లోని సెక్షన్ 37(6) ప్రకారం ధర్మారం గ్రామ పంచాయతీ 11వ వార్డు సభ్యుడు నూనె సాయి గణేష్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. క్రమశిక్షణా చర్యల ప్రక్రియ పూర్తయ్యే వరకు లేదా 6 నెలల కాలపరిమితిముగిసే వరకు,ఏది ముందుగాజరిగితే అప్పటివరకు సస్పెన్షన్‌అమల్లో ఉంటుందని పేర్కొన్నారు.ఈ అంశానికి సంబంధించి సంబంధిత నిందితులపై పోలీస్ స్టేషన్లో కేసు బుక్ చేశామని, ఎఫ్.ఐ.ఆర్ నెం. 204/2026, తేది .26.10.2026 కేసు ఫైల్ అయిందని అన్నారు.సస్పెన్షన్ ఉత్తర్వుల అమలుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ధర్మారం మండల పరిషత్ అభివృద్ధి అధికారిని ఆదేశించినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.

# ఎం.ఎన్.జె. క్యాన్సర్ ఆసుపత్రిలో టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో అన్నదానం

**-రోగులకు, సహాయకులకు భోజనం పంపిణీ చేసిన మారం జగదీశ్వర్, డా. ఎస్.ఎం. హుస్సైనీ ముజీబ్**



**చురకలు ప్రతినిధి హైదరాబాద్, అక్టోబర్ 27 :** టీఎన్జీవోస్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డా. ఎస్.ఎం. హుస్సైనీ ముజీబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా హైదరాబాద్ లోని ఎం.ఎన్.జె. క్యాన్సర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు, వారి సహాయకులకు అన్నదానం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి టీఎన్జీవోస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్ ముఖ్య అతిథిగా హాజరై, డా. ఎస్.ఎం. హుస్సైనీ ముజీబ్‌తో కలిసి రోగులకు, వారి సహాయకులకు స్వయంగా భోజనం పంపిణీ చేశారు.తన తల్లిదండ్రులు స్వర్గీయ అసదుల్లా హుస్సైనీ, అన్వరున్నీసా స్మారకార్థం ఏర్పాటు చేసిన అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా డా. హుస్సైనీ ముజీబ్ ప్రతి వారం ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి చికిత్స కోసం వచ్చి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రోగులకు, వారి కుటుంబ సభ్యులకు ఈ కార్యక్రమం ఎంతో తోడ్పాటునందిస్తోంది.ఈ సందర్భంగా మారం జగదీశ్వర్ మాట్లాడుతూ, అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి ఆహారం అందించి, కష్టకాలంలో అండగా నిలవడం గొప్ప మానవతా సేవ అని అన్నారు. తల్లిదండ్రుల స్మారకార్థం ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి ప్రతి వారం క్యాన్సర్ రోగులకు,వారి సహాయకులకు భోజనం అందిస్తున్న డా. హుస్సైనీ ముజీబ్ సేవలను అభినందించారు.ఉద్యోగుల హక్కుల పరిరక్షణతో పాటు సామాజిక బాధ్యతలోనూ టీఎన్జీవోస్ ముందుంటుందని,యూనియన్ నాయకులు, సభ్యులు ఇటువంటి సేవా కార్యక్రమాలకు సహకరించాలని పిలుపునిచ్చారు.డా.ఎస్.ఎం.హుస్సైనీ ముజీబ్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న రోగులకు కడుపునిండా భోజనం పెట్టడం ఎంతో తృప్తినిస్తుందని పేర్కొన్నారు.సమాజం నుంచి పొందిన దానిలో కొంతైనా తిరిగి సమాజానికి అందించాలనే సంకల్పంతో ఈ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సహాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యతని,యూనియన్ నాయకులు, సభ్యులు ఈ కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం సంతోషంగా ఉందని అన్నారు.అనంతరం మారం జగదీశ్వర్, డా. హుస్సైనీ ముజీబ్ ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఇతర సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులకు అవసరమైన సహాయ సహకారాలను యూనియన్ తరఫున అందించేందుకు సిద్ధంగా ఉన్నామని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ కేంద్ర సంఘం అసోసియేట్ అధ్యక్షులు సత్యనారాయణ గౌడ్, కస్తూరి వెంకట్, ఉపాధ్యక్షులు కొండల్ రెడ్డి, హైదరాబాద్ సిటీ అధ్యక్షుడు శ్రీకాంత్, హైదరాబాద్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కె.ఆర్. రాజ్‌కుమార్, ఏపీఈఆర్ఓ మహ్మద్ వహీద్, క్యాన్సర్ ఆసుపత్రి యూనిట్ అధ్యక్షుడు శివకుమార్, యూనిట్ కార్యదర్శి శేఖర్, డి. శివ, రాజేష్ యాదవ్, హరీష్, చౌష్ తదితర యూనియన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.రోగులకు ఆహారం అందిస్తూ వారి కష్టసమయంలో అండగా నిలుస్తున్న అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ సేవలను పలువురు అభినందించారు. భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగించాలని ఆకాంక్షించారు.

# ఖేలో ఇండియా వాలీబాల్ పోటీలకు ఎంపిక

**చురకలు విలేకరి, జగిత్యాల, అక్టోబర్ 27 :**

ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఖేలో ఇండియా అండర్-17 బాలబాలికల వాలీబాల్ జట్ల ఎంపిక కోసం మంగళవారం కరీంనగర్ లోని అంబేద్కర్ స్టేడియంలో సెలక్షన్ ట్రయల్స్ నిర్వహించారు.అర్జున అవార్డు గ్రహీత రవికాంత్ రెడ్డి (2002) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎంపికల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులను ఎంపిక చేశారు. హైదరాబాద్ లోని ఎల్.బి.స్టేడియంలో జరగనున్న ఖేలో ఇండియా పోటీల్లో పాల్గొనేందుకు ఈ ఎంపికలు నిర్వహించినట్లు, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన యువ క్రీడాకారులను గుర్తించి రాష్ట్రస్థాయిలో అవకాశాలు కల్పించడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్ హాక్ కమిటీ సభ్యులు పడాల అజయ్ గౌడ్, రాధాకృష్ణ రెడ్డి, పాము సత్యం, ఆరిఫ్,



సంపత్, శ్రీనాథ్ రెడ్డి, దాగూర్, పీడీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ అమరవీరుల సంస్మరణలో భాగంగా ఓపెన్ హౌస్



**చురకలు ప్రతినిధి,జగిత్యాల,అక్టోబర్ 27 :** పోలీస్ అమరవీరుల సంస్మరణ (పోలీస్ ఫ్లాగ్ డే)లో భాగంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో విద్యార్థులకు మంగళవారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసుశాఖ ప్రజలకు అందిస్తున్న సేవలు, పోలీసు పనితీరు, వైర్లెస్ సెట్ వినియోగం, లాకప్, ఎఫ్ఐఆర్ నమోదు విధానం, సీసీ కెమెరాల పనితీరు, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, డయల్ 112 సేవలు, రిసెప్షనిస్ట్ విధులు, 24 గంటలు అందుబాటులో ఉండే పోలీసు శాఖ, ఫింగర్ ప్రింట్స్ ద్వారా నేరస్తుల గుర్తింపు, పోలీసు ఆయుధాల పనితీరు, భరోసా సెంటర్, షీ టీమ్స్, ఫ్రెండ్లీ పోలీసింగ్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.పోలీస్ స్టేషన్ అంటే ఏమిటి, శాంతిభద్రతల పరిరక్షణలో దాని పాత్ర, పనివిధానం విద్యార్థులు తెలుసుకోవాలని పోలీసు అధికారులు సూచించారు. ఈ కార్యక్రమాల్లో సీఐ లు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎంపీ ధర్మపురి అరవింద్‌ను కలిసిన నారపాక అశోక్



**చురకలు విలేకరి,బీర్పూర్,అక్టోబర్ 27 :** నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్‌ను బీజేపీ ఎస్సీ మోర్చా జగిత్యాల జిల్లా అధ్యక్షుడు నారపాక అశోక్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా జగిత్యాల జిల్లాలో బీజేపీ ఎస్సీ మోర్చాను బలోపేతం చేయడం,దళిత సామాజిక వర్గాన్ని బీజేపీకి మరింత చేరువ చేసేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. బీర్పూర్ మండలంలో పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడం, గ్రామస్థాయిలో పార్టీ కార్యకలాపాలను విస్తృతం చేయడం,ప్రజా సమస్యల పరిష్కారం,మండల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై పలు అంశాలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లినట్లు నారపాక అశోక్ తెలిపారు.పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజల మధ్య పనిచేస్తున్న నాయకులు,కార్యకర్తలకు అండగా ఉంటామని,పార్టీ బలోపేతానికి అవసరమైన మద్దతు అందిస్తామని ఎంపీ భరోసా ఇచ్చినట్లు పేర్కొన్నారు.రాబోయే రోజుల్లో జిల్లాలో ఎస్సీ మోర్చాను బలోపేతం చేస్తూ దళిత వర్గాల సంక్షేమం లక్ష్యంగా ముందుకు సాగుతామని నారపాక అశోక్ తెలిపారు.

## జాతీయ స్థాయి ఖేలో ఇండియా క్యాంప్‌కు కేపీఎస్ విద్యార్థిని అల్లె హేమ ఎంపిక



**చురకలు ప్రతినిధి కోరుట్ల, అక్టోబర్ 27 :** కోరుట్ల పబ్లిక్ స్కూల్ (కేపీఎస్) విద్యార్థిని అల్లె హేమ జాతీయ స్థాయి ఖేలో ఇండియా శిక్షణ శిబిరానికి ఎంపికైంది. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో 45 రోజుల పాటు నిర్వహించనున్న ఈ శిక్షణ శిబిరానికి ఆమె ఎంపిక కావడం పట్ల పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. ఈ శిక్షణ శిబిరంలో ప్రతిభ కనబరిచి, డిసెంబర్‌లో వరంగల్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి ఖేలో ఇండియా క్రీడల్లో పాల్గొనేందుకు హేమకు అవకాశం లభించనుంది. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ప్రతిభ చాటుకుని జాతీయ స్థాయికి చేరుకోవడం అభినందనీయమని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ కేపీఎస్ విద్యార్థులు ప్రతిభ కనబరుస్తూ సర్వతోముఖ అభివృద్ధి సాధిస్తున్నారని తెలిపింది. హేమ సాధించిన విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొంది. ఈ సందర్భంగా కేపీఎస్ కరస్పాండెంట్ గుజ్జేటి వెంకటేష్, ఉపాధ్యాయులు హేమను, ఆమె తల్లిదండ్రులను అభినందించారు. జాతీయ స్థాయిలోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, తెలంగాణ రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# భూముల రీ-సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

**-కలెక్టర్ బి. సత్యప్రసాద్**



**చురకలు ప్రతినిధి కోరుట్ల, అక్టోబర్ 27 :** భూముల రీ-సర్వే ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు.కోరుట్ల మండలం ధర్మారం గ్రామంలో నిర్వహిస్తున్న భూముల రీ-సర్వే పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే పనుల పురోగతిని, సర్వే నిర్వహిస్తున్న విధానాన్ని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వే సమయంలో భూముల హద్దులు, భూ యజమానుల వివరాలు, అందుబాటులో ఉన్న భూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. రీ-సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించి, భూములకు సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేయాలని తెలిపారు. భూముల సరిహద్దులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రికార్డుల్లో నమోదైన వివరాలతో సరిపోల్చుకోవాలని అధికారులకు సూచించారు. సర్వే నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి, నిబంధనల ప్రకారం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. సంబంధిత రెవెన్యూ, సర్వే అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రీ-సర్వే ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామస్థాయిలో భూముల వివరాల పరిశీలనలో పారదర్శకత పాటిస్తూ, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని తెలిపారు. సర్వే పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, నిర్దేశిత విధానాల ప్రకారం ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, తహసీల్దార్ కృష్ణ చైతన్య, సర్వే అధికారులు పాల్గొన్నారు.

# కోరుట్ల బస్ స్టేషన్‌లో సౌకర్యాలను పరిశీలించిన ఎమ్మెల్యే

**-ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి**

**-పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి**

**చురకలు ప్రతినిధి కోరుట్ల అక్టోబర్ 27 :** పట్టణంలోని బస్ స్టేషన్‌ను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మంగళవారం సందర్శించి ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు.ఈ సందర్భంగా బస్ స్టేషన్‌లో పరిశుభ్రతను పాటించాలని,ప్రయాణికులకు నిరంతరం తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. కళాశాల విద్యార్థులు,నిత్యం హైదరాబాద్‌కు రాకపోకలు సాగించే ప్రయాణికుల సౌకర్యార్థం కోరుట్ల నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులు నడపాలని కోరారు.అదేవిధంగా భక్తుల సౌకర్యార్థం యాదాద్రి,భద్రాచలం దేవస్థానాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని సూచించారు. కోరుట్ల ఆర్టీసీ డిపోలో పాత బస్సులు ఎక్కువగా ఉన్నందున, ప్రయాణికులకు మెరుగైన ప్రయాణ సౌకర్యాలు కల్పించేందుకు మంచి కండిషన్‌లో ఉన్న బస్సులను కేటాయించాలని కోరారు. అలాగే నిజామాబాద్, కరీంనగర్ వంటి ప్రధాన పట్టణాలకు బస్సు సర్వీసులను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా రద్దీ ఉన్న మార్గాల్లో బస్సుల సంఖ్య పెంచాలని సూచించారు. విద్యార్థులు ఉద్యోగులు భక్తులు నిత్యం ప్రయాణించే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రజా రవాణా వ్యవస్థను మరింత మెరుగుపరిచేందుకు ఆర్టీసీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కోరారు.



## సీసీ డ్రైనేజీ పనులు ప్రారంభం



**- ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి రూ.5 లక్షలు మంజూరు**

**- ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కృషితో అభివృద్ధి పనులకు శ్రీకారం**

**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం అక్టోబర్ (27) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని బర్దిపూర్ గ్రామంలో అభివృద్ధి పనుల్లో భాగంగా సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు.గ్రామంలో మురుగునీటి సమస్యలను తగ్గించి, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో చేపట్టిన ఈ పనులకు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కృషితో మాజీ రాజ్యసభ సభ్యులు కేఆర్ సురేష్ రెడ్డి ఎంపీల్యాడ్స్ నిధుల నుంచి రూపాయలు 5లక్షలు మంజూరయ్యాయి .గ్రామంలో సీసీ డ్రైనేజీ పనులు చేపట్టేందుకు మార్గం సుగమమైంది. గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిధుల వినియోగం కీలకమని,డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపడటం ద్వారా మురుగు నీటి నిల్వ సమస్యలను తగ్గించేందుకు అవకాశం ఉంది. గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు కావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంగం సాగర్, ఉప సర్పంచ్ భీంకర్ అఖిలేశ్, గ్రామ కార్యదర్శి దివాకర్,కారోబార్ రాజేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## టీయూడబ్ల్యూజే నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**-అధ్యక్షుడిగా సభావత్ మల్లేష్**



**చురకలు విలేకరి, మల్లాపూర్, అక్టోబర్ 27 :** మల్లాపూర్ మండల టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ప్రెస్ క్లబ్ నూతన కమిటీని మంగళవారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు చీటి శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మల్లాపూర్ మండల ఐజేయూ అధ్యక్షుడిగా సభావత్ మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా బద్దం శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా బద్దం రాంచందర్ రెడ్డి, కోశాధికారిగా సింగిరెడ్డి అశోక్, సంయుక్త కార్యదర్శిగా వాసం మధుకర్‌ను కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఐజేయు జిల్లా అధ్యక్షులు చీటి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. జర్నలిస్టులకు హెల్త్ కార్డుల మంజూరు, ఇంటి స్థలాల కేటాయింపు వంటి సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు, వారి సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జగిత్యాల జిల్లా ఐజేయు ప్రధాన కార్యదర్శి బెజ్జంకి సంపూర్ణ చారి, రాష్ట్ర ఐజేయూ కౌన్సిల్ సభ్యులు రాగుల గోపాలచారి, జిల్లా కోశాధికారి సిరిసిల్ల వేణుగోపాల్, జిల్లా కమిటీ ఉపాధ్యక్షులు లోక రమణారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు నిమిషకవి రాజేష్,గౌరవ అధ్యక్షులు ర్యాగల వెంకటేశ్వర్లు, గౌరవ సలహాదారులు గుగ్గిల రాజ శేఖర్, మిడిదొడ్డి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ వేంకటేశ్వరస్వామి రథోత్సవం

**-పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 27 :** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామంలోని శ్రీ హరిహర దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన రథోత్సవానికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ కమిటీ చైర్మన్ పాపారావు, వేద పండితులు రాధాకృష్ణ శర్మ, రామాచారి, సప్తగిరి, సుధాకర్‌శర్మ తదితరులు వేదమంత్రాలు



,మంగళవాయిద్యాల నడుమ ఆది శ్రీనివాస్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన వేద పండితుల ఆశీర్వాదం తీసుకున్నారు. ఆలయ కమిటీ తరపున చైర్మన్ పాపారావు తీర్థప్రసాదాలు అందజేశారు.

**భక్తిశ్రద్ధల నడుమ రథోత్సవం**

శ్రీవేంకటేశ్వరస్వామిని గరుడ వాహనంపై అలంకరించి, మంగళవాయిద్యాలు, భాజాభజంత్రీలు, భజనల నడుమ గ్రామ వీధుల్లో ఊరేగించారు.ఈ వేడుకలో గంభీరావుపేట మండలంతో పాటు వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.రథోత్సవం సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హమీద్, సహకార సంఘం చైర్మన్ వేషాల వెంకటి, లింగన్నపేట గ్రామ సర్పంచ్ పిట్ల ఎల్లయ్య, ఆలయ వైస్ చైర్మన్ జోగు సురేష్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్, కొత్తపల్లి గ్రామ అధ్యక్షుడు మెండే భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



# కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోకండి

**-ఐకేపీ వద్ద కొనుగోలు కేంద్రాలను స్థానిక సర్పంచులతో కలిసి ప్రారంభించిన ఏఎంసి చైర్మెన్ మేడిపల్లి దేవానందం**

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 27 :** రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే వరి ధాన్యాన్ని అమ్మి రైతులు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని బొప్పాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిపల్లి దేవానందం పేర్కొన్నారు.ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు రాగట్లపల్లి పధిర హరిదాస్ నగర్ వెంకటాపూర్ పోతిరెడ్డిపల్లి అగ్రహారం గ్రామాలలో ఏఎం సి చైర్మన్ మేడిపల్లి దేవానందం స్థానిక సర్పంచులతో కలిసి ఐకేపీ వద్ద కొనుగోలు కేంద్రాలను మంగళవారం



ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏఎంసి చైర్మెన్ మేడిపల్లి దేవానందం , స్థానిక సర్పంచి ఎనుగందుల నరసింహులు సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు దొమ్మాటి నరసయ్య కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షేక్ గౌస్ బాయ్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం వలన మన రాష్ట్రంతో పాటు సుమారు 180రాష్ట్రాలలో తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడబోతున్నాయని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నందున మన రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎల్‌నినో కరువు పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని అరుతడి పంటలు సాగు చేసుకోవాలని సూచనలు చేస్తున్నారని దాన్ని రైతులు అర్థం చేసుకొని ఎల్ ని నో కరువు వలన కరెంటు ఉండదు బావుల్లో బోరుల్లో చెరువుల్లో కుంటల్లో నీరు ఉండదు కరువును అధిగమించడం కోసం ఆలోచించి పంటలు సాగు చేసి నష్టపోకుండా ఉండాలని వారు విజ్ఞప్తి చేశారు.మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి సర్కార్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాల ద్వారా నిర్వహించడం జరుగుతుందన్నారు. రైసు మిల్లర్లు నేరుగా రైతుల నుంచి వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు తమకు సమాచారం ఉందని అక్కడ ప్రభుత్వం మద్దతు ధర కంటే లాభం అనిపిస్తే రైతులు విక్రయించుకోవచ్చు అన్నారు, రైతులు 17% మ్యాచరు వచ్చే విధంగా వరి ధాన్యాన్ని ఆరబెట్టి ప్రభుత్వ మద్దతు ధరను పొంది సద్వినియోగం చేసుకోవాలని వారు పిలుపునిచ్చారు, ఈకార్యక్రమంలో ఏపీఎం వెంకటలక్ష్మి ,పంచాయతీ కార్యదర్శి కృష్ణ యాదవ్, ఏఎంసి వైస్ ప్రెసిడెంట్ నంది కిషన్, ఎస్సీ ఎస్టీ జిల్లా మానిటరింగ్ కమిటీ మెంబర్ బిపేట రాజకుమార్ మాజీవైస్ ప్రెసిడెంట్ గుండాడి రామ్ రెడ్డి,ఉప సర్పంచ్ బందారపు బాల్రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్రి శ్రీనివాస్ రెడ్డి బండారి బాల్రెడ్డి,లాలాబాయి,తులసి గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు భాగ్య వివో ఏ గుండం మంజుల సిసి దేవేందర్,సుదర్శన్,ఎరుపుల శ్రీనివాస్ , మైనార్టీ నాయకులు రఫిక్,కోనేటి పోచయ్య,రాజేందర్ రెడ్డి సర్పంచులు మామిళ్ల కిషన్ ఏ ఎం సి డైరెక్టర్లు వార్డు సభ్యులు మహిళా సంఘం ప్రతినిధులు రైతులు పాల్గొన్నారు,

# హెచ్‌ఆర్‌పిసి జిల్లా ప్రధాన కార్యదర్శిగా అబ్దుల్ మాలిక్ నియామకం

**చురకలు పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, కమాన్ పూర్ అక్టోబర్ 27 :** హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎండీ.అబ్దుల్ మాలిక్ నియమితులయ్యారు.ఈ మేరకు కమిటీ రాష్ట్ర నాయకత్వం ఆయనకు అధికారిక నియామక పత్రాన్ని అందజేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.ఈ సందర్భంగా ఎండీ.అబ్దుల్ మాలిక్ మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా తనను నియమించిన రాష్ట్ర కమిటీ



బాధ్యులకు,జిల్లా నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. సమాజంలో అణగారిన వర్గాలు, నిస్సహాయులు, బాధితుల హక్కుల పరిరక్షణ కోసం కమిటీ ఆధ్వర్యంలో నిరంతరం పోరాడతానని స్పష్టం చేశారు.జిల్లాలో ఎక్కడైనా మానవ హక్కుల ఉల్లంఘన జరిగితే వెంటనే స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చట్టపరంగా అండగా నిలుస్తామని తెలిపారు.సామాజిక న్యాయం,ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జిల్లావ్యాప్తంగా కమిటీని మరింత పటిష్టం చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.విద్యావంతుడు, యువకుడు అయిన ఎండీ.అబ్దుల్ మాలిక్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టడం పట్ల స్థానిక మేధావులు, యువజన సంఘాల ప్రతినిధులు,వివిధ ప్రజా సంఘాల నాయకులు,మిత్రులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## డ్రగ్స్,గంజాయి నివారణే లక్ష్యం

**-షాపుల్లో పోలీసుల విస్తృత సోదాలు**



**చురకలు విలేఖరి వీణవంక అక్టోబర్ 27 :** వీణవంక మండల కేంద్రంతో పాటు ఘన్ముక్ల గ్రామంలోని పలు షాపుల్లో వీణవంక పోలీసులు డాగ్ స్క్వాడ్ సహాయంతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. డ్రగ్స్,గంజాయి విక్రయాలు, నిల్వలపై అందిన ముందస్తు సమాచారంతో అనుమానాస్పదప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సోదాల్లో ఎలాంటి మాదకద్రవ్యాలు లభించలేదని అధికారులు స్పష్టం చేశారు.డ్రగ్స్ రహిత సమాజం కోసమే ఈ తనిఖీలు చేపట్టామని తెలిపారు.గ్రామాల్లో ఎక్కడైనా మాదకద్రవ్యాల విక్రయాలు, అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

**-జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే**



**చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డి పేట అక్టోబర్ 27 :** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం సిరిసిల్ల పట్టణ పరిధిలోని స్థానిక హెబ్రోను చర్చిలో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.సమాజ రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధులు నిర్వర్తిస్తూ ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని చర్చి పాస్టర్లు, ఫాదర్లతో కలిసి ప్రార్థనలు చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని తెలిపారు.అమరవీరుల కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందని, వారి సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తుందని పేర్కొన్నారు. ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యాలు కలగాలని, సమాజంలో మతసామరస్యం, శాంతిసామరస్యాలు వెల్లివిరియాలని చర్చి ప్రతినిధులతో కలిసి ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో ఎస్పీ వెంట డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ శ్రీనివాస్, చర్చి పాస్టర్లు, ఫాదర్లు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి మంత్రి పరామర్శ

**చురకలు ప్రతినిధి మంథని అక్టోబర్ 27 :** పట్టణంలోని దొంతులవాడ లో మంథని ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి, ఆంధ్రజ్యోతి ఆర్ సీ ఇంచార్జ్ పోతరాజు



సమ్మయ్య తల్లి పోతరాజు వెంకటమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంగళవారం పరామర్శించారు. వెంకటమ్మ చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మృతి పట్ల విచారణ వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులైన పోతరాజు శ్రీనివాస్, వెంకటేష్, వెంకటలక్ష్మి, తిరుమల, స్వప్నలను ఓదార్చి తమ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట మంథని మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్, ఈఆర్ సీ శశిభూషన్ కాచే, ఏఎంసీ కుడుదుల వెంకన్న, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆయిలి ప్రసాద్, ఆర్టిఏ మెంబర్ మంథని సురేష్, గౌతమేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గుండా రాజు, నేతలు ఉప్పట్ల శ్రీనివాస్, కొండ శంకర్, జంబోజు సమ్మయ్య, అంకూష్ మాచీడి రవితేజ గౌడ్, రాము గౌడ్ ఉన్నారు.

## పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో.. రక్తదాన శిబిరం



**చురకలు ప్రతినిధి హుజురాబాద్, అక్టోబర్ 27 :** పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా హుజురాబాద్ పట్టణంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్ రావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏసీపి వాసంశెట్టి మాధవి, సిఐ కరుణాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా, ప్రశాంతంగా జీవిస్తున్నారంటే అందుకు పోలీసులు అహర్నిశలు శ్రమిస్తూ ప్రజలకు రక్షణ కల్పించడమే కారణమని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల సేవలు, త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. రక్తదానం ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడే మహత్తరమైన సేవ అని, ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, రామకృష్ణ, వెంకట్, ఎస్ఐలు రవి, కృష్ణారావు, శేఖర్ రెడ్డి, తిరుపతి, క్రాంతి, స్వాతి, వైద్యులు శ్రీకాంత్ రెడ్డి, సుజాత, కౌన్సిలర్లు, పట్టణ యువకులు, ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హుజురాబాద్లో .. ఖేత్ బచావో అభియాన్



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ అక్టోబర్ 26 :** వ్యవసాయ శాఖ జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా 'రైతు నేస్తం' వీడియో కాన్ఫరెన్స్ ప్రత్యేక కార్యక్రమంతో పాటు 'ఖేత్ బచావో అభియాన్' సదస్సును మంగళవారం హుజురాబాద్ లోని రైతు వేదికలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక సహాయ వ్యవసాయ సంచాలకులు జి సునీత మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయంలో సమతుల్య ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ నేలల ఆరోగ్యాన్ని మెరుగుపరచాలని పిలుపునిచ్చారు. నీటి సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ సుస్థిర పోషక నిర్వహణ పద్ధతులు మరియు సహజ వ్యవసాయాన్ని వేగవంతం చేయాలని ఆమె సూచించారు.కె.వి.కె. శాస్త్రవేత్త ప్రశాంతి ఖేత్ బచావో అభియాన్ ముఖ్య ఉద్దేశాలను వివరిస్తూ, నేలలను సంరక్షిస్తూ భావి తరాలకు ఆరోగ్యకరమైన భూములను అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రస్తుత ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు యాసంగి సాగుకు ముందు అందుబాటులో ఉన్న నీటి వనరులు, నేల స్వభావాన్ని అంచనా వేసి నీటి లభ్యతకు అనుకూలమైన పంటలను ఎంపిక చేసుకోవాలని కోరారు. అలాగే పంటల సరళి, విత్తే సమయం, కాలపరిమితిని పరిగణనలోకి తీసుకుని అధికారుల సూచనల మేరకు ఎరువుల వినియోగం, సేద్యం చేపట్టాలని రైతులకు మార్గదర్శనం చేశారు. స్థానిక మున్సిపల్ చైర్మెన్ సుహాసిని మాట్లాడుతూ, ఎల్ నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అధికారులు సూచించిన పంటల ఎంపిక, సాగునీటి యాజమాన్య పద్ధతులను పాటిస్తూ పెట్టుబడి నష్టపోకుండా రైతులు జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెరికల్చర్ ఏడీ వెంకన్న, ఏవో భూమిరెడ్డి, కౌన్సిలర్లు బోరగల్ల సమ్మయ్య, సొళ్ళు సునీత, కో-ఆపరేటివ్ శాఖ అధికారులు, ఏఈవోలు, పీఏసీఎస్ సీఈవోలు, ఎఫ్‌పీఓ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ పై మహిళలు అప్రమత్తంగా ఉండాలి

**-ఉచిత మెగా వైద్య శిబిరంలో ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి**



**చురకలు విలేఖరి,తిమ్మాపూర్ అక్టోబర్ 27 :** ప్రాణాంతకమైన క్యాన్సర్ వ్యాధిపై మహిళలు అవగాహన పెంచుకుంటూ అప్రపత్తంగా ఉండాలని టీపీసీసీ ఎస్సీ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్య నారాయణ అన్నారు.ఇల్లంతకుంట మండల కేంద్రంలోని జై శ్రీమన్నారా యణ ట్రస్ట్ భవనంలో మంగళవారం మహిళలకు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిర ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిపై సరైన అవగాహన లేకపోవడం వల్ల చాలామంది మహిళలు ఈ వ్యాధి బారినపడటం ఆందోళన కలిగిస్తోందన్నారు. ప్రాథమిక దశలోనే వ్యాధి లక్షణాలు గుర్తించి చికిత్స పొందితే ఈ వ్యాధి దూరమవుతుందని చెప్పారు. గైనకాలజిస్ట్ అయిన త సతీమణి డాక్టర్ కవ్వంపల్లి అనురాధ మహిళలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలు, వ్యాధుల గురించి తెలుసు కనుకనే క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించేందుకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న ఎం.ఎన్.జె. ఆంకాలజీ సంస్థ, ప్రాంతీయ క్యాన్సర్ కేంద్రానికి చెందిన వైద్యులు ఉచితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తు న్నారని,క్యాన్సర్ వ్యాధిగ్రస్తులను గుర్తించిన తదుపరి కూడా ప్రభుత్వ పరంగా వైద్య సహాయం అందించడం జరుగుతుందన్నారు. ఈ వ్యవహారాల్లో కార్పొరేట్ ఆసుపత్రుల ప్రమేయం ఎంత మాత్రం ఉండబోదని ఆయన స్పష్టం చేశారు.ఈ విషయంలో ఎలాంటి అనుమానాలకు,అపోహలకు తావు లేదని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు.అంకిత్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఎండీ డాక్టర్ అనురాధ మాట్లాడుతూ మహిళ లు క్యాన్సర్ వ్యాధిబారిన పడకుండా ఉండాలనే ఉద్దేశంతోనే వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.ఈ శిబిరంలో మహిళలకు మూడు రకాల క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించ నున్నట్లు ఆమె వివరించారు.రొమ్ము క్యాన్సర్, నోటి క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని, అందులో భాగంగానే తొలుత మానకొండూరు మండల కేంద్రంలో నిర్ధారణ పరీక్షల శిబిరం నిర్వహించగా ఇప్పుడు ఇల్లంతకుంటలో నిర్వహిస్తున్నట్టు ఆమె వివరించారు. ఇలాగే అన్ని మండలాల్లోనూ ఇతర శిబిరాలను నిర్వహిస్తామని ఆమె వివరించారు.ఈ శిబిరంలో డాక్టర్ సంధ్య, డాక్టర్ తేజస్విని, డాక్టర్ వినీలయ్,సీ. సర్వేశ్వర ప్రసాద్, డాక్టర్ రేవతి, డాక్టర్ శంషద్, డాక్టర్ సాయి తేజ , డాక్టర్ సరస్వతి, డాక్టర్ శ్రీవల్లి, డాక్టర్ వినయ్, డాక్టర్ జిక్రియా, డాక్టర్ ఎండి సుల్తానా అయ్యపరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి,పాక్స్ చైర్మన్ ఊట్కూరు వెంకటరమణారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ అంతగిరి సాహిత్య-వినయ్, వైస్ చైర్మన్ భరత్ రెడ్డి,ఇల్లంతకుంట గ్రామ సర్పంచ్ మామిడి రాజు, బెజ్జంకి పాక్స్ చైర్మన్ ఒగ్గు దామోదర్,ఏఎం సీ మాజీ చైర్మన్లు ఐరెడ్డి మహేందర్ రెడ్డి,పులి కృష్ణ, నాయకులు కాత మల్లేశం,నేరెళ్ళ విజయ్,పసుల వెంకటగౌడ్,బొలవేని రమేష్,భాస్కర్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# బాలల రక్షణకు చట్టాలపై అవగాహన తప్పనిసరి

**-హుజురాబాద్ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె. వీణ ప్రణతి**
**-కేరళ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు**




**చురకలు ప్రతినిధి హుజురాబాద్ అక్టోబర్ 26 :** బాలలపై జరుగుతున్న లైంగిక వేధింపులను అరికట్టడానికి మరియు వారి హక్కులను పరిరక్షించడానికి చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడం అత్యంత ఆవశ్యకమని రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె. వీణ ప్రణతి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సూపర్ బజార్ రోడ్డులోని కేరళ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఆవరణలో విద్యార్థులకు పోక్సో చట్టం మరియు లైంగిక వేధింపుల నివారణపై ప్రత్యేక న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి జడ్జి మాట్లాడారు. "పాఠశాలల్లో లేదా బయట ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, వేధింపులకు గురిచేసినా విద్యార్థులు భయపడకూడదు. వెంటనే ఆ విషయాన్ని తమ తల్లిదండ్రులకు కానీ, ఉపాధ్యాయులకు కానీ ధైర్యంగా తెలియజేయాలి,"అని జడ్జి సూచించారు. బాలలపై లైంగిక నేరాలకు పాల్పడటం చట్టరీత్యా తీవ్ర శిక్షార్హమైన నేరమని, ఇలాంటి ఘటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ దాచిపెట్టకుండా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని స్పష్టం చేశారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో విద్యార్థులు సోషల్ మీడియా వాడుకకు దూరంగా ఉండాలని, వ్యక్తిగత భద్రత పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. బాలల రక్షణ కోసం ప్రత్యేకంగా 'పోక్సో' చట్టం అందుబాటులో ఉందని, ప్రతి విద్యార్థి తమకు ఉన్న చట్టపరమైన హక్కులను తెలుసుకోవాలని పేర్కొన్నారు. పిల్లల భద్రత కేవలం తల్లిదండ్రులకే పరిమితం కాదని, పాఠశాల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు మరియు సమాజం అంతా కలిసి సమష్టి బాధ్యతగా తీసుకోవాలని జడ్జి తెలిపారు. విద్యార్థులకు సురక్షితమైన, స్వేచ్ఛాయుతమైన వాతావరణం కల్పించినప్పుడే వారి హక్కుల పరిరక్షణ సాధ్యమవుతుందని అన్నారు. ఈ న్యాయ విజ్ఞాన సదస్సులో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కాటం సౌజన్య, డైరెక్టర్లు గౌతంరెడ్డి, సంపత్, ఉపాధ్యాయులు వాణిశ్రీ, అశ్విని, సరిత, పీటర్, రాజు, మనోజ్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులను అభినందించిన జిల్లా కలెక్టర్



**చురకలు విలేకరి, జగిత్యాల, అక్టోబర్ 27 :** వియత్నాం సందర్శించి వచ్చిన ఉపాధ్యాయినులను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అభినందించారు. రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి 17 వరకు ఎడ్యుకేషనల్ టూర్ లో భాగంగా వియత్నాం వెళ్లి వచ్చిన జగిత్యాల పట్టణంలోని గవర్నమెంట్ ఓల్డ్ హైస్కూల్ ఉపాధ్యాయురాలు గంప విద్యాదేవి,మెట్‌పెల్లి ఎంపీపీఎస్ ఇంద్రానగర్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు వేముల శ్రీలతలను కలెక్టర్ అభినందించారు.ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ వియత్నాంలో విద్యా సంస్థల సందర్శన ద్వారా తెలుసుకున్న విషయాలను మన జిల్లాలో కూడా అమలు చేయాలని, తద్వారా విద్యా వ్యవస్థను పటిష్టం చేయడానికి అవకాశం ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాము, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, పీఆర్టీయూ టీఎస్ జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి బోయినపల్లి ఆనంద్ రావు పాల్గొన్నారు.

# ఆరు నెలలైనా అందుబాటులోకి రాని పబ్లిక్ టాయిలెట్లు

**-సిరిసిల్ల పట్టణ పాత బస్టాండ్‌లో మహిళల అవస్థలు**
**-అధికారుల నిర్లక్ష్యంపై బీజేపీ నాయకురాలు బరకం వెంకటలక్ష్మి ఆగ్రహం**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 27 :** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్‌లో పబ్లిక్ టాయిలెట్ల సమస్య ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. పాత టాయిలెట్లను తొలగించి ఆరు నెలలు గడుస్తున్నా, కొత్త టాయిలెట్లను నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురాకపోవడంపై బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు బరకం వెంకటలక్ష్మి అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే పాత బస్టాండ్‌లో కనీస మరుగుదొడ్ల సదుపాయం లేకపోవడం విచారకరమని ఆమె పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు అవసరమైన కనీస వసతులు కల్పించడంలో అధికారులు ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు.

**తాత్కాలిక టాయిలెట్లతోనూ తప్పని తిప్పలు.**

ప్రయాణికుల ఇబ్బందులను తగ్గించేందుకు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మొబైల్ టాయిలెట్లలో సైతం నీటి సదుపాయం లేకపోవడం, అపరిశుభ్రత, దుర్వాసనతో ప్రజలు అవస్థలు పడుతున్నారని వెంకటలక్ష్మి పేర్కొన్నారు. మహిళలకు అత్యవసరమైన మరుగుదొడ్ల సదుపాయం కల్పించడంలో ఇంత జాప్యం ఎందుకు జరుగుతోందని నిలదీశారు.ఆరు నెలలుగా సమస్య కొనసాగుతున్నా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం పట్ల ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజా రవాణా కేంద్రంలో మహిళలకు గౌరవప్రదమైన, పరిశుభ్రమైన సదుపాయాలు కల్పించడం అధికారుల బాధ్యత అని స్పష్టం చేశారు.

**ఇప్పటికైనా స్పందించాలి.**

సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పాత బస్టాండ్‌లో నూతన పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, అప్పటివరకు మొబైల్ టాయిలెట్లలో నీటి సదుపాయం కల్పించి పరిశుభ్రతను పర్యవేక్షించాలని బరకం వెంకటలక్ష్మి డిమాండ్ చేశారు. మహిళలు, ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు.

# కళల ద్వారా సామాజిక రుగ్మతలను రూపుమాపవచ్చు

**-జిల్లా విద్యాధికారి వై.తిరుపతిరావు**



**చురకలు ప్రతినిధి కరీంనగర్ అక్టోబర్ 27 :** ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకొని ఎస్.సి ఇ.ఆర్.టి.తెలంగాణ మరియు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రోల్ ప్లే పోటీలు నిర్వహించడం జరిగింది.ఈ రోల్ ప్లే పోటీలను ప్రారంభించిన జిల్లా విద్యాశాఖ అధికారి తిరుపతిరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఎంతో సృజన దాగి ఉంటుందని ఉపాధ్యాయులు నిరంతరం విద్యార్థులను గమనిస్తూ వారిలో దాగివున్న అంతర్గత సృజనను వెలికి తీయాల్సిన అవసరం ఉందని ఆ దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు.విద్యార్థుల్లో బాల్యదశ నుండి వివిధ సామాజిక రుగ్మతల పట్ల స్పృహ కలిగి ఉండాలని కోరారు. అంతేకాకుండా ఆరోగ్యము, మానసిక ఆరోగ్యము, విలువలు, లింగ సమానత, మత్తు పదార్థాలకు దూరంగా ఉండటం, శారీరక, మానసిక రక్షణ.. సామాజిక మాధ్యమాలయందు జాగ్రత్తగా ఉండడం ఇలాంటి విషయాల మీద అవగాహన కలిగి ఉండాలని ఎస్.సి.ఇ.ఆర్.టి ఈ విషయాల పట్ల పిల్లల్లో అవగాహన కలిగించడానికి ఇలాంటి రోల్ ప్లేస్ ను ఏర్పాటు చేసిందని, వీటిని విద్యార్థుల్లో విరివిగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని,విద్యార్థులు ఇలాంటి సామాజిక రుగ్మతల యందు తగు జాగ్రత్తగా మసులుకోవాలని అలాగే విద్యార్థులను ఉపాధ్యాయులు నిరంతరం ప్రోత్సహిస్తూ సృజనని బయటకు తీయాలని సూచించారు.తదనంతరం ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో విద్యాశాఖ సెక్టోరల్ అధికారులు కర్ర అశోక్ రెడ్డి, మిల్కూరి శ్రీనివాస్, సైన్స్ అధికారి చాడ జయపాల్ రెడ్డి, న్యాయనిర్ణేతలుగా ఖాజా మంజూర్ అలీ,గాజుల రవీందర్ పాల్గొన్నారు.

# ప్రజాధనం దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరపాలి

**-టిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జ్ కూకట్ల సంతోష్ కుమార్ యాదవ్**



**చురకలు ప్రతినిధి హుజూరాబాద్ అక్టోబర్ 26 :** హుజూరాబాద్ మున్సిపాలిటీలో టెండర్ల కేటాయింపుల నుంచి ఉత్సవాల నిర్వహణ ఖర్చుల వరకు ప్రజాధనం తీవ్రంగా దుర్వినియోగం అవుతోందని, దీనిపై జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని తెలంగాణ రక్షణ సేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ కూకట్ల సంతోష్ కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానికంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజలు కష్టపడి చెల్లించిన పన్నుల సొమ్ముకు పాలకవర్గం మరియు అధికారులు సరైన లెక్కలు చూపించడం లో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు.దసరా ఉత్సవాల సందర్భంగా 40 అడుగుల రావణాసురుడి విగ్రహం ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకుని, వాస్తవంగా 30 అడుగుల విగ్రహాన్ని మాత్రమే ఏర్పాటు చేశారనే అనుమానాలు ఉన్నాయని, అధికారులు కొలతలు తీసి ఒప్పంద పత్రాలు మరియు బిల్లులను వెంటనే బహిర్గతం చేయాలని కోరారు. ఒకే కాంట్రాక్టర్‌కు పదేపదే పనులు కట్టబెట్టడం, వినాయక నిమజ్జనం పనులను రూ. 99,000 చొప్పున తొమ్మిది భాగాలుగా విడగొట్టి కేటాయించడం వెనుక పెద్ద ఎత్తున నిబంధనల ఉల్లంఘన జరిగిందని విమర్శించారు. అంతేకాకుండా కాంట్రాక్టర్ల సొంత పనులకు మున్సిపాలిటీకి చెందిన జేసీబీలు, వాహనాలను వాడుకుంటున్నారనడానికి లాగ్‌బుక్స్ మరియు డీజిల్ రికార్డులను పరిశీలిస్తే నిజాలు బయటపడతాయని పేర్కొన్నారు. సద్దుల బతుకమ్మ, దసరా వేడుకల పేరిట లైటింగ్, ఫ్లెక్సీలు, సౌండ్ సిస్టమ్స్ కోసం చేసిన ఖర్చులకు పారదర్శకమైన లెక్కలు చూపాలని స్పష్టం చేశారు. మున్సిపాలిటీలో కాంగ్రెస్ పాలన సాగుతుండగా, ప్రతిపక్ష హోదాలో ఉన్న బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లు ఈ అక్రమాలపై ప్రశ్నించకుండా మౌనంగా ఉండటం సరికాదని, నాయకుడు ప్రణవ్ బాబు కూడా దీనిపై తన వైఖరిని స్పష్టం చేయాలని సూచించారు. ప్రజాధన రక్షణ కోసం తాము చేస్తున్న ఈ పోరాటాన్ని బెదిరింపులకు భయపడి ఆపేది లేదని, అధికారులు సమగ్ర విచారణ జరిపి నిజాలను ప్రజల ముందుకు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు పొన్నం శిరీష, బంద అశోక్, డిటీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం.. ప్రాణదానంతో సమానం

**-పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా వేములవాడలో మెగా రక్తదాన శిబిరం**



**చురకలు ప్రతినిధి రాజన్న సిరిసిల్ల అక్టోబర్ 27 :** దేశరక్షణ కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలు, త్యాగాలు చిరస్మరణీయమని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితేతో కలిసి ఆయన మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు.సుమారు 400 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేసి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడే అవకాశం లభిస్తుందని, రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.దేశ భద్రత కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరులకు ఘన నివాళులర్పించడంతో పాటు, రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడం అభినందనీయమన్నారు. అమరవీరుల త్యాగస్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన ఈ మెగా రక్తదాన శిబిరం సేవాభావానికి, మానవత్వానికి ప్రతీకగా నిలిచింది. సుమారు 400 మంది రక్తదాతలు స్వచ్ఛందంగా ముందుకు రావడం విశేషం.

# యువకుడికి దేహశుద్ధి



**చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డి పేట అక్టోబర్ 27 :** మహిళల పట్ల అసభ్యంగా వ్యవహరిస్తున్నాడనే ఆరోపణలతో ఓ యువకుడిని పట్టుకొని చితకబాదిన ఘటన ఎల్లారెడ్డిపేటలో జరిగింది.బాధితులు,పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేటకు చెందిన యువకుడు మండలంలోని ఓగ్రామంలో అమ్మాయిలను వేధిస్తున్న క్రమంలో కాలనీవాసులు అడ్డుకొని బెదిరించడంతో అక్కడి నుండి పారిపోయాడు.వెంటనే ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో జుబేర్‌ను బిజెపి నాయకులు పట్టుకొని చితకబాదారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై రమేష్ గౌడ్ అక్కడికి చేరుకొని సదరు యువకుడిని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.బిఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగం నాయకుడిగా జుబేర్ చెలామణి బిఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగం నాయకుడిగా జుబేర్ చెలామణి అవుతున్నాడనే మండలంలో ప్రచారం జరుగుతుంది.మాజీ మంత్రి సిరిసిల్ల ఎంఎల్యే కెటిఆర్‌తో జుబేర్ దిగిన పోటోలను పోలీసులు జుబేర్‌ను అదుపులోకి తీసుకున్న తరువాత వాట్సాప్ ఫేస్బుక్‌లలో వైరల్ అవుతున్నాయి.

# డీఎస్సీ-2024 ఉపాధ్యాయులకు ప్రొబేషన్ డిక్లేర్ చేయాలి

**చురకలు విలేకరి, జగిత్యాల, అక్టోబర్ 27 :** 2024 డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు ప్రొబేషన్ డిక్లేర్ చేసి ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా నాయకులు విద్యాధికారిని కోరారు. ఈ మేరకు మంగళవారం టీఎస్ యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తిరుకోవెల శ్యామ్ సుందర్, అంబటి భూమేశ్వర్ లు జిల్లా విద్యాధికారి కె. రామును కలిసి వినతిపత్రం అందజేశారు. డీఎస్సీ-2024 ద్వారా నియామకమైన ఉపాధ్యాయులకు ప్రొబేషన్ డిక్లేర్ చేస్తూ రెండో ఇంక్రిమెంట్ ను వెంటనే మంజూరు చేయాలని, జిల్లాలోని ఇతర పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

